# చిత్రం

-వి.ఎల్.పద్మసుందరి

ఉదయం తొమ్మిది గంటల సమయం. యవ్వన మధువును ఆస్వాదించేందుకు రంగురంగుల ఆశల రెక్కలు కట్టుకుని పూలతోటపై వాలిన సీతాకోకచిలుకల్లా వయసు విచ్చిన, విచ్చుకుంటున్న యువతీ, యువకుల సయ్యాటలతో, పలకరింపులతో వాతావరణం ఆహ్లాదంగా ఉంది.

కాఫీ సిప్ చేస్తూ కాలేజీ క్యాంపస్‌ని కలియజూస్తున్న అమర్‌ని ఉద్దేశించి

"నా బొమ్మ ఎప్పుడుగీస్తావ్?" అప్సర అడిగింది.

ఆ ప్రశ్నకి అతని దృష్టి ఆమె మీదకి మళ్లింది. పై నుంచి క్రిందదాకా చూశాడు.

నల్లని వత్తయిన జుట్టు, విశాలమైన నుదురు, కలలని మేల్కొలిపే కళ్ళు తిన్నగా ఉంచి చివర్న చిన్ని ఒంపు తిరిగిన నాశిక. గీత గీసినట్లుండే పెదవులు, నున్నని మెడ వేసుకున్నది చుడీదార్ అయినా ఎత్తుగా ఉన్న యెదసంపద. టైట్ ఫిట్ కావడంతో పట్టినట్లు అనిపించే నడుం. పద్మినిజాతి లక్షణాలు నిండిన పేరుకి తగ్గ రూపు అప్సరది. 'నాలోని చిత్రకారుడిని మేల్కొలపగలిగిన సొగసు..' అనుకున్నాడు.

"ఎంతసేపు చూస్తావు?" విసుక్కుంది.

"చూడకుండా గీయడం ఎలా? నువ్వేమో గీసేటప్పుడు ఎదురుగా కూర్చోనంటావు. కనీసం మనసులోనైనా నీ రూపాన్ని ముద్రించుకోకుండా నీ బొమ్మ ఎలా గియ్యగలను?" వాదిస్తున్నట్లుగా ప్రశ్నించాడు.

"కబుర్లు చెప్పకు. నువ్వు గీసే ప్రకృతిచిత్రాలు..రోడ్డుమీద ట్రాఫిక్‌లో అడుక్కునే ముష్టిది..చలికి గుడమెట్ల మీద వానలో వణికే చిన్న కుర్రాడు....ఇలాంటివన్నీ వాళ్ళు నీ దగ్గరికి వచ్చి గీయించుకుంటేనే గీశావా...? అయినా ఈరోజు నువ్వు నన్ను కొత్తగా చూడడం ఏమిటి? నేను డిగ్రీలో చేరి మూడేళ్ళు, మన పరిచయం వయసు రెండేళ్ళు. ఈ ఏడాదితో నా డిగ్రీ, నీ పిజి కూడా పూర్తయిపోతాయి. ఇంకా నీకు నా బొమ్మ గీయడానికి కుదరడం లేదా?" రోషంగా నిలదీసింది.

"లుక్... అప్సరా! ప్రతి ఆర్టిస్ట్‌కి ఒక మూడ్ ఉంటుంది. అది ఉంటేనే కానీ గియ్యలేం. ఒకవేళ గీసినా అది కాన్వాస్ మీద రంగులు పులమడమే అవుతుంది. కానీ మంచి చిత్రం అవ్వదు" తన ప్రాబ్లమ్ వివరిస్తున్నట్లు చెప్పాడు.

"ఓ..రియల్లీ..." పెదాలు బిగించింది అప్సర.

"మిస్టర్ అమర్ టు బి ఫ్రాంక్. నీ దగ్గరున్న బ్యాడ్ మేనర్స్ చెప్పనా. నీలో స్కిల్ ఉంది. టాలెంట్ ఉంది. బట్, అనుకున్న టైంకి అనుకున్న దానిని పూర్తిచెయ్యకుండా వాయిదా వేయడానికి వంకలు వెతికే లేజీనెస్ కూడా చాలా ఉంది. ఆ బద్ధకానికి నువ్వు పెట్టుకున్న ముద్దుపేరు మూడ్. ఓకే లీవిట్. నీకెప్పుడు మూడ్ వస్తే అప్పుడు నా బొమ్మ గీశాకే నన్నొచ్చి కలువ్. అంతవరకూ గుడ్‌బై" చెప్పి విసురుగా పైకి లేచి పర్స్‌లోంచి త్రాగిన కాఫీ డబ్బులు టేబుల్‌మీద పెట్టి విసవిసా వెళ్ళిపోయింది.

ఆమెకోపానికి అమర్ పెదాల మీద చిరునవ్వు కదిలింది.

వాళ్లిద్దరి మధ్య బంధం స్నేహానికి ఒక మెట్టు పైనే ఉంది. ఫైన్ ఆర్ట్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేస్తున్న అమర్, బిఏ తెలుగు లిటరేచర్ చేస్తున్న అప్సరా తొలిసారి కాలేజ్‌లోని ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో కలిశారు. అమర్ వేసిన నిశ్శబ్ద స్వప్నం మంచుకొండల సౌందర్యం అప్సర మనసును ఆకట్టుకుని, కోరి అతనితో పరిచయాన్ని స్నేహాన్ని పెంచుకునేందుకు కారకాలయ్యాయి. ఆమెలోని చలాకీతనం, ఎదుటివారిలోని లోపాలను, పొరపాట్లను నిర్భయంగా వ్యక్తంచేసే తత్వం అమర్‌ని ఆకట్టుకుని ఇద్దరి మధ్యా అనురాగాన్ని పెంచాయి.

'అప్సర బాగా హర్టయ్యినట్లుంది. ఎలాగైనా ఈసారి ఆమె చిత్రాన్ని వేసే తీరాలి' అప్సర ఇచ్చిన డబ్బులు జేబులో వేసుకుని ఇద్దరికి తనే బిల్లు పే చేసి బయటకి నడుస్తూ అనుకున్నాడు అమర్.

★ ★ ★

కావలసిన రంగులు, బ్రష్‌లు, కాన్వాస్ షీట్స్ కొనుక్కుని రూమ్‌కి చేరేసరికి అమర్ రూమ్‌మేట్ వేణు లగేజి ప్యాక్ చేసుకుంటున్నాడు.

"ఎక్కడికిరా ప్రయాణం..?" చెప్పులు విప్పుతూ అడిగాడు.

"మా నాన్న టెలిగ్రాం ఇచ్చారురా. మా బామ్మకి సీరియస్‌గా ఉందట. అటో, ఇటో అయితే రావడానికి పదిహేనురోజులు పడుతుంది. అందుకే ఈ ఏర్పాట్లు..." బ్యాగ్ జిప్ మూసి చెప్పాడు.

"అరె... అప్సర బొమ్మ గీద్దాం అనుకున్నాను. నువ్వు ఉంటే ఏవైనా మార్పులు, చేర్పులు ఉంటే సలహా ఇస్తావని ఆశపడ్డాను" కాస్త నిరాశగా అన్నాడు అమర్.

షూ తొడుక్కుంటున్న వేణు నవ్వేశాడు.

"ఊరుకోరా... నువ్వు మంచి ఆర్టిస్ట్‌వి, అప్సర నీ లవ్వర్. కళ్ళు మూసుకుంటే కళ్లముందు కనబడుతుంది. ఇంక పొరపాట్లకి, మార్పులకి ఛాన్సే లేదు. బెస్టాఫ్ లక్. నేనొచ్చేసరికి నీ బొమ్మ పూర్తయిపోవాలి. ట్రైన్‌కి టైమవుతోంది. నేను వెళతాను" భుజం తట్టి చెప్పి వెళ్ళిపోయాడు వేణు.

రూం లోపలినుండి మూసేసి స్టాండ్‌కి కాన్వాస్ బిగించి రకరకాల భంగిమల్లో అప్సర చిత్రాన్ని చిత్రించడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఏ ఒక్కటీ ఫలించలేదు. ఫోటో తీసినట్లు మొహాన్ని మాత్రమే చిత్రించడం అతనికి ఇష్టం లేదు. విసిగివేశారి, నా వల్ల కాదేమోనని నిరాశపడుతుండగా అతనికి తట్టింది ఆ రూపు. ఊహ మాత్రానికే ఒళ్లంతా వింత గగుర్పాటు కలిగింది. ఇక దానిని చిత్రిస్తే...కూర్చున్న చోటునుండి లేచి కాన్వాస్ దగ్గరకి వెళ్ళాడు. అతని కుంచె కాన్వాస్ మీద కదం తొక్కింది.

★ ★ ★

వారంరోజుల తర్వాత... ఫ్రెండ్స్‌తో హస్క్ వేస్తున్న అప్సరను పక్కకి పిలిచి "నీ బొమ్మ గీస్తేనే గానీ కలవద్దు అన్నావుగా, సాయంత్రం ఒకసారి రూమ్‌కొస్తే కళ్లారా చూసుకుందు గానీ...' కొంటెగా చెప్పాడు.

అలకతీరినట్లు చేతులు కట్టుకుని ఎటో చూస్తు వింటున్న అప్సర చివ్వున అతనికేసి తిరిగి

"నిజంగా..." నమ్మలేనట్లు అడిగి "అయితే ఇప్పుడే వస్తాను పద" ఉత్సాహంగా అంది.

దూరం నుండి అప్సర లెక్చరర్‌ని చూసి "మీ సార్ వస్తున్నారు. ఇప్పుడు కాదు. అయినా కాసే పైనా సస్పెన్స్ లేకపోతే నీకు ఇంట్రెస్ట్. నాకు థ్రిల్ రెండూ ఉండవు. ఈవెనింగ్ కలుద్దాం. బై" చెప్పి వెళ్ళిపోయాడు.

పట్టలేని సంతోషంతో ఈ శుభవార్త తన ఫ్రెండ్‌కి చెప్పేందుకు క్లాస్‌రూం లోకి దూరింది అప్సర.

★ ★ ★


"అబ్బబ్బా! ప్రొద్దుటినుండి తెగ ఊరించి చంపేస్తున్నావు. ఇప్పుడైనా చూపిస్తావా...? ఇంకా ఆగాలా..?" కాస్త మురిపెంగా కోపాన్ని నటిస్తూ అడిగింది.

రూంకి వచ్చాకా కూడా ఏమీ చూపించకుండా ఫ్లాస్క్‌లో కాఫీ కప్పులో పోసి తీసుకొచ్చి చిందర వందరగా ఉన్న బట్టలు, పుస్తకాల్లోంచి స్టూలు లాంటి దాన్ని తీసి వేసి మర్యాదలు చేస్తున్న అమర్‌ని చూసి నవ్వుకుంటూ అంది.

"రాక రాక మా రూంని పావనం చేసేందుకు వచ్చిన ప్రియసఖికి ఈ మాత్రమైనా సేవలు చెయ్యకపోతే ఎలా?" కప్పు అందిస్తూ వినయంగా అన్నాడు.

"సంతోషించాం కానీ ముందు నా బొమ్మను నాకు చూపించు"

ఒక్క నిముషం. వెళ్ళి రూండోర్ గడియవేసి గదిలో ఓ వారగా ఉంచిన కాన్వాస్ స్టాండ్‌తో సహా ఎత్తి తెచ్చి ఆమె ముందు ఉంచి లైట్లు





## ఆలోచన

కొంతమంది తారలు హఠాత్తుగా తీసుకునే నిర్ణయాలు ప్రేక్షకులకి, ఆమె అభిమానుల్ని షాక్‌కి గురిచేస్తాయి. ఈ సంగతి వింటే మీరూ అలాగే అంటారు. 'ఇకనుంచి నేను ఎలాంటి ఎక్స్‌పోజింగ్‌లు, సెక్సీ సీన్స్‌లో నటించాలనుకోవడం లేదు. నా ఆలోచనల్ని గౌరవిస్తేనే సినిమాల్లో నటిస్తాను' అని చెబుతోంది ప్రియాంక చోప్రా. ఆమె చెప్పే మాట మరో పదేళ్ళ తర్వాతైతే బాగుంటుంది అని అంటున్నారు ఆమె సన్నిహితులు. అంటే ఇకనుంచి ఆమె చూపులతో గుచ్చేస్తుందన్నమాట. ఆమె ఇలాగే మాట్లాడితే ఉన్న అవకాశాలు కూడా కొండెక్కుతాయంటున్నారు.

ఆన్ చేసి కాన్వాస్ పైనున్న గుడ్డను పైకి ఎత్తివేశాడు.

ఎంతో ఆసక్తిగా, ఇష్టంగా.. ఒళ్ళంతా కళ్ళుగా విప్పార్చుకుని చూస్తున్న అప్సర కంటికి కనిపించని హస్తం ఛెళ్ళున చరిచినట్లు తుళ్ళిపడింది. అమర్ తన బొమ్మ గీశానని చెప్పగానే తనని తాను ఎన్నోరకాలుగా ఊహించుకుంది.

కానీ ఆ ఊహలలో ఏ ఒక్కదాని పొంతన లేకుండా.. అరవిచ్చిన గులాబీని గుండెలమీద పెట్టుకుని కాస్త ఓ ప్రక్కకి తిరిగి కవ్విస్తున్నట్లు నవ్వుతున్న తన పరిపూర్ణ నగ్నచిత్రాన్ని నమ్మలేనట్లు చూస్తుండిపోయింది.

"ఎలా ఉంది?" వెనకగా వచ్చి భుజాల మీదగా వాలి గుసగుసలాడుతున్నట్లు అడిగాడు.

తేరుకున్నట్లు చూసి "నన్ను అలా...ఎన్నిసార్లు చూశావ్..?" తలపైకెత్తి అడిగింది.

ఫకాలున నవ్వాడు అమర్.


"జోక్ చేస్తున్నావా? మనమధ్య ఏకాంతం ముద్దుల పరిధే దాటలేదు. ఇంక నిన్ను అలా చూసే అదృష్టం నాకెక్కడిది. ఇది జస్ట్ నా ఊహా చిత్రం"

అప్సర పైకి లేచి చేతిలో కప్పు స్టూల్ మీద పెట్టి "ఓకే. ప్యాక్ చేసి ఇస్తావా? ఉదయం నువ్వు నా బొమ్మ గీశానని చెప్పగానే ఆనందం పట్టలేక నాఫ్రెండ్స్‌కి, క్లాస్‌మేట్స్‌తో పాటు మమ్మీ, డాడీలకి కూడా ఫోన్ చేసి అమర్ నా బొమ్మగీశాడు తీసుకొచ్చి చూపిస్తానని డబ్బా కొట్టుకున్నాను. ఇస్తే పట్టుకెళతాను" నిర్లిప్తంగా అంది.

తుళ్ళిపడ్డట్టు చూశాడు అమర్.

"ఆర్ యూ మ్యాడ్. ఇదేం న్యూడ్ మోడల్ పెయింటింగ్ కాంపిటీషన్‌కి పంపేదనుకున్నావా? నలుగురిలోనూ ప్రదర్శన పెట్టడానికి. దీనిని గీసినంతకాలం నేను రూమ్ లోపలే గడియపెట్టుకుని ఎవరి కంటా పడకుండా పూర్తిచేశాను తెలుసా?" కాస్త కోపంగా అడిగాడు.

"ఓ..అంత కష్టపడ్డావా? కానీ మిస్టర్ అమర్. నీలో ఇంత గొప్ప చిత్రకారుడు ఉన్నాడని అతగాడు ఒక్కసారీ చూడకపోయినా నా నగ్న సౌందర్యాన్ని ఇంత అందంగా గీయగలిగాడని నాకు తెలియదు. ఎందుకంటే నేనేం టైటానిక్ హీరోయిన్‌ని నా గుడ్డలు లేకుండా బొమ్మలు గీయించుకుని మురిసిపోవడానికి. ఆఫ్టరాల్ ఓ మధ్యతరగతి ఆడపిల్లని. అందుకే బట్టలిప్పుకుంటే తప్ప ఒక చిత్రకారుడిని స్పందింపచేసే ఏ సౌందర్యం నాలో లేదని ఊహించలేక నువ్వేదో అందరికీ కనిపించే నా ముక్కు, మొహాన్నే గీసి ఉంటావని భ్రమపడి ఊరందరికీ చెప్పుకున్నాను" ఆమె గొంతులో ఆక్రోశం ధ్వనించింది.




అమర్ ఏం చెప్పాలో తెలియనట్లు నిరత్తురుడై చూశాడు.

అప్సర కాన్వాస్ కేసి కదలడంతో ఆమె దానిని తీసుకుపోతుందనే భయంతో అప్రయత్నంగా అడ్డంగా వెళ్ళి నిలబడ్డాడు.

హేళనగా నవ్వింది అప్సర.

తన బుక్స్ తీసుకుని మౌనంగా వెనుదిరిగింది. గుమ్మం దాకా వెళ్ళి వెనక్కి తిరిగి "అమర్ నాదో రిక్వెస్ట్. ఒక ఆర్టిస్ట్‌ని ఇలా కోరడం దారుణమేనేమో. ప్చ్... ఏం చెయ్యను. నాకు వేరే దారిలేదు. నువ్వు చెప్పినదాన్ని బట్టి ఈ చిత్రానికి సాక్ష్యాలు మనిద్దరమే కదూ. నీ మీద నాకు నమ్మకం ఉంది. కానీ మరో మగాడి కంట ఇదిపడితే మా డాడీ పరువు బజారులో, నా శవం స్మశానంలో ఉంటుంది. అందుకే దయచేసి ఈ చిత్రాన్ని నాశనం చేసెయ్యి. న్యూడ్‌మోడలింగ్ చేసి ప్రపంచం ముందు నా అందాన్ని స్వేచ్ఛగా ప్రదర్శించగలిగే ధైర్యం కలిగితే నీతోనే మళ్లీ నా బొమ్మ గీయించుకుంటాను. అంతవరకూ నీ కళాహృదయాన్ని గుర్తించలేని ఈ మధ్యతరగతి అమ్మాయి అప్సరను, వంటినిండా గుడ్డలు వేసుకున్నా అణువణువునా శల్య పరీక్ష చేసే సంఘాన్ని క్షమించి వదిలేసెయ్" చేతులు జోడించి చెప్పి తలుపు తెరచుకుని వడివడిగా వెళ్ళిపోయింది.

ఒక్కసారి ఆమెతోటే తన సర్వశక్తులు హరించుకుపోయినట్లు ఒక చేత్తో కాన్వాస్ మీద షీట్‌ని అడ్డంగా చింపేస్తూ క్రింద కూలబడిపోయాడు. చాలాసేపటికి కానీ అప్సర మాటల నుండి తేరుకోలేకపోయాడు.

ఊరంతా చీకట్లు ముసురుకునే వేళ అమర్ కళ్లకి కమ్మిన పొరలు తొలగిపోయిన ఫీలింగ్ కలిగి లేచి మూడురోజులు తిండి, నిద్రమాని కష్టపడి గీసిన చిత్రాన్ని తన చేతులతోటే ముక్కలుగా చింపి కాల్చి తగలబెట్టి ఆ బూడిదను పదిలంగా ఎత్తి తీసుకెళ్ళి డ్రైనేజీలో కలిపేసి తృప్తిగా నిట్టూర్చాడు.

అయినా అతని మనసుకు శాంతిగా అనిపించలేదు.

అప్సర తన తొందరపాటుకి ఎంత హర్ట్ అయ్యిందో ఆమె మాటల్లో అర్థమయ్యింది.

'నిజమే.. ఓ ఆడపిల్లని ఆమె పర్మిషన్ లేకుండా నగ్నంగా చిత్రించడానికి నాకేం అధికారం ఉంది?

వేణు ఊర్లో లేడు కనుక సరిపోయింది. వాడే ఉండి ఈ చిత్రాన్ని చూస్తే ఈ విషయం బయటకి పొక్కితే...

ఆడది అంటే ఆకలిగా చూసే లోకం అప్సరను బ్రతకనిచ్చేదా?'

ఆ ఊహే అమర్‌ని భయపెట్టింది. అతనిలో ఎలాగైనా తన పొరపాటు తనే దిద్దుకోవాలనే పంతం పెరిగింది.

కానీ..ఎలా? మనసు పరిపరివిధాల ఆలోచించ సాగింది.

* * *

నెలరోజులు గడచిపోయాయి. ఈ నెల్లాళ్ళుగా ఎంత ప్రయత్నించినా అప్సర అమర్‌ని కలవడానికి, మాట్లాడడానికి ఇష్టపడలేదు.

చివరికి చేసేది లేక మరోసారి ఆమె అనుమతి లేకుండా అమర్ మరో సొంత నిర్ణయాన్ని తీసుకుని ఇంటర్నల్ యూనివర్శిటీ పెయింటింగ్ కాంపిటీషన్స్‌కి తను గీసిన ఆమె చిత్రాన్ని పంపాడు. దాని ఎగ్జిబిషన్ వాళ్ళ కాలేజీ క్యాంపస్‌లోనే జరిగింది.

అలాంటి కార్యక్రమాల్లో ఎప్పుడూ చలాకీగా ఉండే అప్సర అనాసక్తిగా నిర్లిప్తంగా అటువైపునకు వెళ్లడానికి కూడా ఇంట్రెస్ట్ చూపనట్లు ఉండిపోయింది.

అమర్‌లో క్షణక్షణానికి ఆత్రుత పెరిగిపోతోంది. ఎగ్జిబిషన్ ఓపెన్ అయిన మర్నాడు స్టూడెంట్స్ నుండి, లెక్చరర్స్ నుండి అతను కోరుకున్న ఎఫెక్టు రాసాగింది.

స్నిగ్ధమైన ముగ్ధ సౌందర్యాన్ని అంత అద్భుతంగా చిత్రించినందుకు అతన్ని అభినందించిన వాళ్ళే తిన్నగా అప్సర దగ్గరకి వెళ్ళి..

."అప్సరా! ఆరోజు అమర్ గీసిన బొమ్మ చూపిస్తానని మాకు నువ్వు చూపించనేలేదు. ఈరోజు దానిని మేం చూశాం. అమర్ బొమ్మ చూశాకే నీలో ఎంతటి సౌందర్యం ఉందో మాకు తెలిసింది. చూస్తూ ఉండు. ఈ కాంపిటీషన్‌లో దానికే ఫస్టు ప్రైజ్ వస్తుంది. అమర్‌కి దక్కే ఆ క్రెడిట్ అంతా నీదే. కంగ్రాట్స్'' అని అభినందించి వెళ్లసాగారు.

వాళ్ల మాటలకి అప్సర గుండెల్లో రాయి పడింది.

'అమర్ ఆ రోజు నా చిత్రం నాశనం చెయ్యలేదా..? పైగా దానిని కాలేజీ క్యాంపస్‌లో ప్రదర్శనకి కూడా పెట్టాడా...?

ఆ ఊహకే ఆమె ఒణికిపోయింది.

బుక్స్ సీట్లో పారేసి పరుగెత్తుకుంటూ ఎగ్జిబిషన్ దగ్గరకి వెళ్లింది.

ఒక్కొక్కటిగా వెతుక్కుంటూ వెళుతుంటే ఓ వారగా కొందరు గుంపుగా చేరి గుసగుసలాడుకుంటూ చూస్తున్న దృశ్యం కనిపించింది.

వాళ్ల దగ్గరికి వెళ్ళి నెట్టుకుంటూ ముందుకు వెళ్ళి పెయింటింగ్ చూసి ఒక్క క్షణం తన కళ్లను తానే నమ్మలేనట్లు చూస్తుండిపోయింది.

మోకాలు పైదాకా నార చీర కట్టుకుని, నును పైన భుజాలు కనిపిస్తుంటే సన్నటి పైటను ముడి కట్టు రవికకు ఆచ్ఛాదనగా వేసుకుని జుట్టంతా కుడి భుజంపైకి ముడిపెట్టి అడవిపూలతో మాలలు మెడలో, ముడిలో తురుముకుని మునికన్య వేషధారణలో ఉన్న అప్సర తన మనసులాగే స్వచ్ఛంగా ఉన్న కొలను నీటిలోని తన ప్రతిబింబాన్ని 'నన్ను చూసి అసూయ చెందకు' అన్నట్లుగా వెక్కిరిస్తున్నట్లున్న చిత్రం.

దానికి అమర్ పెట్టిన పేరు 'స్నిగ్ధ సౌందర్యం'.

నిజంగానే చిత్రం చాలా అద్భుతంగా ఉంది. చూస్తున్న అప్సర కళ్లల్లో నీళ్ళు నిండుకున్నాయి. ఆమెను గుర్తుపట్టిన అక్కడి జనం అభినందించసాగారు.

వాళ్లకి కృతజ్ఞతలు తెలుపుకుని చున్నీతో కళ్ళు వత్తుకుంటూ వస్తుంటే కాస్త దూరంగా ఒక చెట్టు క్రింద చేతులు కట్టుకుని ఆమె తీర్పుకై వేచిచూసే ముద్దాయిలా పెరిగిన గడ్డం, పీక్కుపోయిన మొహంతో అమర్ ఆమెకేసే చూస్తూ కనిపించాడు.

మరి ఆగలేనట్లు పరుగున దగ్గరికి వెళ్లి రెండుచేతుల్ని పట్టుకుని కళ్లకి అద్దుకుని పెదాలకి ఆన్చుకుంది.

"యూ ఆర్ రియల్లీ గ్రేట్.." అభినందనగా, కృతజ్ఞతగా అంది.

చిత్రంగా అమర్ కళ్లల్లో కూడా నీళ్ళు తిరిగాయి.

"కోపం పోయిందా?" జాలిగా అడిగాడు.

తన మనసులోని సంతోషం ముఖంలో ప్రతిఫలిస్తుండగా మనసారా నవ్వింది అప్సర.

ఆ నవ్వులో సౌందర్యం అంటే అందాల పోటీల్లో అంగాంగ ప్రదర్శనలు, అజంతా ఎల్లోరా శిల్పాల శృంగారభంగిమలే కాదు. కుంచెతో చూడగలిగే చిత్రకారుడికి అంతర్గత ఆత్మ సౌందర్యాన్ని కూడా అందంగా చిత్రించవచ్చనే వాస్తవాన్ని గ్రహించిన అమర్‌లోని చిత్రకారుడికి అభినందన కూడా అతనికి కనిపించింది.

★

## చిరునవ్వు

''సురేష్! నీ ఫొటోలు వున్న ఆల్బమ్ చూసాను. చాలా ఫొటోల్లో నీ ముఖం చిరునవ్వుతోనే కనబడింది. కానీ కొన్ని ఫొటోలలో చిరునవ్వు మాయం అయిపోయింది. ఎందుకు?''

''నా ముఖంలో చిరునవ్వు మాయమైన ఫొటోలు పెళ్లి అయిన తరువాత దిగినవి. ఇక పెళ్లి తరువాత ఏ మగాడి ముఖంలో చిరునవ్వు కనిపిస్తుంది?''

## హుషారు

''అజయ్! మన రాజేష్ చాలా హుషారుగా కనబడుతున్నాడు ఎందుకు?''

''వారి ఇంటి పక్కనుండే స్రవంతి పెళ్లి రద్దయినందుకు.''

## పని

''సుబ్బారావు! నీ భార్య ప్రభుత్వోద్యోగం చేసి డబ్బు సంపాదిస్తుంటే మరి నువ్వేం చేస్తున్నావు?''

''ఆమె సంపాదించిన డబ్బు కూర్చుని తింటున్నాను. అది కూడా ఒక పనే కదా!''

## సుఖం

''రాజా! ఒక వ్యక్తి పది కాలాలపాటు సుఖంగా, సంతోషంగా వుండాలంటే ఏం చేయాలి?''

''పెళ్లి చేసుకోకుండా ఉండాలి''

**- షేక్ అస్లాం షరీఫ్** (శాంతినగర్)

